క్లుప్తంగా

విద్యార్థినులు అప్రమత్తంగా వ్యవహరించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యార్థినులు అప్రమత్తంగా వ్యవహరించాలని నవాబుపేట ఎస్సై రెహ్మాన్ పేర్కొన్నారు. వెంకటేశ్వరపురంలోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థినులతో ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే దిశ యాప్ లేదా 100కు సమాచారం అందించాలని కోరారు. కానిస్టేబుల్ రమేష్, ప్రధానోపాధ్యాయురాలు మంజులవాణి, ఉపాధ్యాయులు రాజ మనోహర్, లక్ష్మయ్య, ఖాజారహంతుల్లా, ధనరాజ్, తదితరులు పాల్గొన్నారు.

సఖి కేంద్రంలో మెరుగైన సేవలు

నెల్లూరు(వేదాయపాళెం): దిశ సఖి వన్‌స్టాప్ కేంద్రంలో బాధితులకు మెరుగైన సేవలను అందించి.. వారికి అండగా నిలవాలని ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ సభ్యురాలు వెంకటలక్ష్మి పేర్కొన్నారు. సర్వజన ఆస్పత్రి ఆవరణలోని సఖి సెంటర్‌ను శనివారం ఆమె పరిశీలించారు. బాధితులకు అందుతున్న సేవలను ఆరాతీసిన అనంతరం మహిళలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం దిశ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. తొలుత ఆమెకు ఐసీడీఎస్ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సౌజన్య, సఖి కేంద్ర అడ్మిన్ షెహనాజ్, ఎస్జీటీ గీతాకృష్ణ, అడ్వొకేట్ దుర్గాంబ పాల్గొన్నారు.

నేడూ విద్యుత్ బిల్లులను చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథావిధిగా ఆదివారం పనిచేయనున్నాయని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేఏసీ కళాశాలకు పుస్తకం అందజేత

నెల్లూరు (టౌన్): విశ్రాంత ఐఏఎస్ ప్రభాకర్ రచించిన ప్రజాస్వామ్య ప్రస్తావన పుస్తకాన్ని స్టోన్‌హౌస్‌పేటలోని కేఏసీ జూనియర్ కళాశాల గ్రంథాలయానికి శనివారం అందజేశారు. విశ్రాంత ప్రిన్సిపల్ రమణ చేతుల మీదుగా కేఏసీ కళాశాల ప్రిన్సిపల్ గురవయ్యకు ఇచ్చారు.

దంపతులపై దాడి

నెల్లూరు(క్రైమ్): హేళనగా ఎందుకు మాట్లాడారని ప్రశ్నించిన దంపతులపై కొందరు దాడి చేసి గాయపర్చారు. పోలీసుల సమాచారం మేరకు.. రామచంద్రారెడ్డినగర్‌కు చెందిన రాంబాబు టైల్స్ పనులు చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఆయన భార్య అఖిలను అదే ప్రాంతానికి చెందిన రాజా, వెంకటేశ్వర్లు హేళనగా, అసభ్యకర పదజాలంతో ఇటీవల దూషించారు. విషయాన్ని తన భర్తకు శుక్రవారం రాత్రి ఆమె చెప్పారు. దీంతో రాజా ఇంటికి వారు వెళ్లారు. ఎందుకు అవహేళన చేశారని రాజాతో పాటు అక్కడే ఉన్న వెంకటేశ్వర్లును ప్రశ్నించారు. దీంతో ఆగ్రహానికి గురైన వారు, మరికొందరితో కలిసి దంపతులపై దాడి చేశారు. ఘటనలో రాంబాబు పన్ను విరగడంతో పాటు గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): రెండేళ్లుగా కోర్టుకు హాజరుకాకుండా తప్పించుకొని తిరుగుతున్న వ్యక్తిని చిన్నబజార్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఆచారివీధికి చెందిన షాలినీకి విశాఖపట్నానికి చెందిన సురేష్‌తో 2018లో వివాహమైంది. కొంతకాలం వీరి కాపురం సజావుగా సాగింది. అనంతరం కలతలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో కోర్టులో మెయింటెనెన్స్ కేసును ఆమె వేశారు. రెండేళ్లుగా కోర్టుకు హాజరు కాకుండా సురేష్ తప్పించుకొని తిరుగుతున్నాడు. దీంతో కోర్టు ఆయనపై నాన్ బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేసింది. ఈ క్రమంలో ఆయన్ను చిన్నబజార్ పోలీసులు అరెస్ట్ చేశారు.

వ్యక్తికి దేహశుద్ధి

నెల్లూరు(క్రైమ్): రంగనాయకులపేటలోని ఇసుకడొంక సమీపంలో ఓ వ్యక్తికి స్థానికులు శనివారం దేహశుద్ధి చేశారు. అనంతరం సంతపేట పోలీసులకు అప్పగించారు. వివరాలు.. ఆత్మకూరు వద్ద కొంతకాలం క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో అతని తలకు తీవ్ర గాయమై మతిస్థిమితం లేకుండా బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఇసుకడొంక సమీపంలో రోడ్డుపై ఉన్న బైక్ స్టాండ్ తీస్తుండగా.. చోరీకి యత్నిస్తున్నాడని భావించి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అతని మానసిక పరిస్థితి సక్రమంగా లేదని తేలడంతో కుటుంబసభ్యులకు అప్పగించారు.

రైతులకు అండగా ఉంటాం


పార్టీలో చేరిన వారితో కాకాణి గోవర్ధన్‌రెడ్డి

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు(సెంట్రల్): రైతులకు ఎలాంటి అవసరమొచ్చినా అండగా ఉంటూ.. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. వెంకటాచలం మండలం కందలపాడుకు చెందిన పలువురు రైతులు నగరంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో గ్రామంలోని ఒక్క సమస్యా పరిష్కారానికి నోచుకోలేదని చెప్పారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా కందలపాడులో ఇటీవల తాను పర్యటించిన సమయంలో పలు సమస్యలను రైతులు తెలియజేశారన్నారు. తక్షణమే స్పందించి బ్రిడ్జి నిర్మాణంతో పాటు బస్సు సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. ఈ క్రమంలో తన వెంట ఉండటంతో పాటు సీఎం జగన్ మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపర్చాలనే ఉద్దేశంతో పార్టీలో చేరారని వివరించారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి


సూర్యప్రభ వాహనంపై రంగడి విహారం


సీతారామస్వామి మందిరంలో..


వేదగిరిలో..

నెల్లూరు(బృందావనం): రథసప్తమిని నగరంలో భక్తిశ్రద్ధలతో శనివారం జరుపుకొన్నారు. వివిధ ఆలయాల్లో కొలువైన సూర్యభగవానుడికి విశేష పూజలను నిర్వహించారు. నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో రంగడు సప్తవాహన సేవల్లో కొలువై దర్శనమిచ్చారు. సూర్యప్రభ, గరుడ, సింహ, హంస, బంగారు తిరుచ్చి, పెద్దశేష, చంద్రప్రభ వాహనాలపై విహరించారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చెర్మన్ శివకుమార్ ఆచారి, తదితరులు పర్యవేక్షించారు.

• మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో సూర్యనారాయణుడికి విశేష పూజలను నిర్వహించారు.

• బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో శ్రీదేవీ, భూదేవీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామికి సప్తవాహన సేవలను కనులపండువగా నిర్వహించారు. ఉభయకర్తలుగా మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వర్లుగుప్తా, వెంకటరత్నం, కోశాధికారి మస్తాన్‌రావు దంపతులు వ్యవహరించారు.

• వేదాయపాళెంలోని మహాత్మాగాంధీనగర్‌లో గల కృష్ణ మందిరంలో సూర్యభగవానుడికి విశేష పూజలను నిర్వహించారు. దేవస్థాన ధర్మకర్త వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

• పరమేశ్వరినగర్‌లోని సాయికృష్ణ లేఅవుట్‌లో అభయాంజనేయస్వామికి పూజలను అర్చకుడు రాఘవేంద్ర గోపీస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. ధర్మకర్త శ్రీనివాసులు, నిర్మలమ్మ దంపతులు పర్యవేక్షించారు.

• సంతపేటలోని ప్రభుత్వ మోడల్ స్కూల్లో సామూహిక సూర్య నమస్కార కార్యక్రమాన్ని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా శుభమస్తు షాపింగ్ మాల్ అధినేత శ్రీనివాసులు, ఆయుర్వేద వైద్యులు సువర్ణకుమారి హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. యోగా మాస్టర్ ప్రసన్నకుమార్, నేతలు శివ, కార్తీక్, సాయికుమార్, మహేష్, భాను, మణి, సుభాష్, కమలేష్, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్: నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో విశేష పూజలను నిర్వహించారు. సూర్యప్రభ వాహనంపై స్వామివారు విహరించారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని జరిపారు. ఈఓ గిరికృష్ణ, ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య రక్షతో ప్రజలకు భరోసా


కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

• ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: రూరల్ నియోజకవర్గ పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆరోగ్య రక్ష కార్యక్రమాన్ని వచ్చే నెల్లో చేపట్టనున్నానని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూరల్ పరిధిలోని ప్రాంతాల్లో వైద్య పరీక్ష కేంద్రాలను ఉచితంగా ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. పరీక్షలకు వాహనాల్లో తీసుకెళ్లి అనంతరం వారి ఇళ్ల వద్దకు చేరుస్తామని తెలిపారు. ఆపరేషన్లు అవసరమైతే కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా చేయిస్తామని చెప్పారు. తాను నిర్వహించనున్న ఈ కార్యక్రమం పార్టీలకతీతంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆరు కార్పొరేట్ ఆస్పత్రుల యాజమాన్యాలు, 33 మంది వైద్యులు, రెండు స్వచ్ఛంద సంస్థలు, దాతలు, తన స్నేహితులు సహకారం అందించేందుకు ముందుకొచ్చారని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో ఎంతో తృప్తి ఉంటుందన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని 34వ డివిజన్లో గల జెడ్పీ కాలనీలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు సంబంధించిన శంకుస్థాపనను మేయర్ స్రవంతితో కలిసి వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి శనివారం చేపట్టారు. కార్పొరేటర్ ఫమీదా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

• కాకుపల్లిలోని దేశమ్మ ఆలయంలో ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపనను వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి చేపట్టారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ సుభాషిణి, నేతలు కేశవులు, శివసునీల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఈశ్వరయ్య, రమణయ్య, రాధయ్య, వేణు, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో రంగడి ఆలయంలో రూఫింగ్



నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానంలో దాదాపు రూ.50 లక్షలతో వివిధ అభివృద్ధి పనులను దాత అల్లూరు మహేష్‌రెడ్డి సహకారంతో చేపడుతున్నారని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. పనులకు శంకుస్థాపనను శనివారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. రంగడి ఆలయంలో భక్తులు ప్రదక్షిణలు చేసే ప్రాంతంలో రూఫింగ్ చేసేందుకు మహేష్‌రెడ్డి ముందుకురావడంపై సంతోషం వ్యక్తం చేశారు. రానున్న బ్రహ్మోత్సవాల నాటికి రూఫింగ్ పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్లు అస్మ, జయలక్ష్మి, ఆలయ చైర్మన్ శివకుమార్ ఆచారి, ఏపీ ఆగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ నెల్లూరు ఈఎస్‌గా రవికుమార్

నెల్లూరు(క్రైమ్): స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) నెల్లూరు ఈఎస్‌గా గూడూరు ఈఎస్ రవికుమార్‌ను నియమిస్తూ డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఉత్తర్వులను శనివారం జారీ చేశారు. కొంతకాలంగా నెల్లూరు ఇన్‌చార్జి ఏసీగా ఆయన పనిచేస్తున్నారు. తాజా బదిలీల్లో ఆయన్ను నెల్లూరు ఈఎస్‌గా నియమించారు.

ఇరిగేషన్ కార్యాలయం వద్ద వివాహిత ఆందోళన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): భర్త తనను మోసం చేసి మరో మహిళతో సహజీవనం చేస్తున్నారంటూ ఇరిగేషన్ కార్యాలయం వద్ద వివాహిత ఆందోళనను శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా బాధితురాలు శైలజ మాట్లాడారు. నవాబుపేటకు చెందిన తనకు ఇరిగేషన్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మురళీకృష్ణయాదవ్‌తో 2007లో వివాహమైందని చెప్పారు. కొంతకాలంగా ఆయన వేరే మహిళతో సహజీవనం చేస్తూ తనను, పిల్లలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఎస్సార్, హెల్త్‌కార్డుల్లో సైతం ఆమె పేరునే పొందుపర్చారని, ఇదేమని ప్రశ్నిస్తే దాడి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ జరిపి న్యాయం చేయాలని ఇరిగేషన్ ఎస్ఈ కృష్ణమోహన్‌ను కోరారు. పూర్వాపరాలను పరిశీలించి చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.

జమునకు ఘన నివాళి

నెల్లూరు(బృందావనం): ప్రముఖ నటి జమునకు నివాళులర్పించారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఇస్కాన్ సిటీ రోడ్డులోని స్నేహానగర్‌లో నవ్యాంధ్ర రచయిత్రుల సంఘ గౌరవాధ్యక్షురాలు సుభద్రాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సులోచన, లక్ష్మి, నజ్మా, లలిత, పావని, సుందరి, తదితరులు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో విజేతలకు అభినందన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అంతర్జాతీయ స్థాయిలో పాండిచ్చేరిలో నిర్వహించిన యోగా పోటీల్లో విజేతగా నిలిచిన విద్యార్థిని కావ్యశ్రీ, జాతీయ స్థాయిలో బెంగళూరులో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన అరుణకుమారిని జిల్లా యోగా క్రీడా అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో శనివారం అభినందించారు. శాంతినగర్‌లోని నిర్మల సౌధలో నిర్వహించిన కార్యక్రమంలో యోగా విశిష్టతను వివరించే పుస్తకాన్ని ఆవిష్కరించారు. గీతా వైభవ్ ట్రస్ట్ నిర్వాహకుడు నజీర్‌బాషా, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రమణారెడ్డి, పతంజలి యోగా పీఈటీ విజయ్‌కుమార్‌రెడ్డి, మహర్షి యోగా రవీంద్ర, కార్యదర్శి ప్రసన్నకుమార్, శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గౌర - నితాయ్ రథయాత్ర


రథయాత్రకు హాజరైన అశేష భక్తజనం


సుందరంగా తీర్చిదిద్దిన రంగవల్లులు


రాధాకృష్ణుడి వేషధారణలో చిన్నారులు

నెల్లూరు(బృందావనం): నగరంలో గౌర - నితాయ్ రథయాత్రను నేత్రపర్వంగా శనివారం నిర్వహించారు. సంతపేటలోని నాలుగు కాళ్ల మండపం వద్ద రథయాత్రను కమిషనర్ హరిత ప్రారంభించారు. విశేషాలంకారంలో కొలువైన గౌర - నితాయ్‌కు ఇస్కాన్ నెల్లూరు శాఖ అధ్యక్షుడు సుఖదేవస్వామి హారతులిచ్చారు. మినీబైపాస్ రోడ్డులోని పీవీఆర్ కల్యాణ మండపానికి రథయాత్ర రాత్రి చేరింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ఇస్కాన్ మందిర స్వాములు భగవత్ సందేశాన్నిచ్చారు. ప్రత్యేకంగా తీర్చిదిద్దిన వేదికపై గౌర - నితాయ్‌కు చప్పన్‌భోగ్ నివేదన, హారతి కీర్తన, దీప హారతులను సమర్పించారు. అనంతరం రథయాత్రలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీటీడీ న్యూఢిల్లీ సలహామండలి చైర్‌పర్సన్ వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు తోడ్పాటును అందించారు. పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే వస్త్ర సంచులు, గౌర - నితాయ్ లీలలు పుస్తకం, హరేరామ.. హరేకృష్ణ నామస్మరణతో భగవంతుడి చిత్రంతో ఉన్న గోడ గడియారాలను ఆవిష్కరించారు. ఇస్కాన్ వైస్ చైర్మన్ జీబీసీ తిరుపతి రేవతి రామన్‌దాస్, శ్రీనివాస్‌శ్యామ్‌దాస్ (హోసూరు), గోపీనాథ్‌దాస్ (పెరంబూరు), వేణుధారిదాస్ (అరుప్పుకొట్టయ్), కీర్తిరాజ్‌దాస్ (చీరాల), తదితరులు పాల్గొన్నారు.

సినిమా డైలాగులు నీ గొంతుకు సరిపోవు


కరపత్రాలను అందజేస్తున్న అనిల్‌కుమార్‌యాదవ్

• లోకేశ్‌పై ఎమ్మెల్యే అనిల్ విమర్శలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): సినిమాల్లో బాలకృష్ణ చెప్పే డైలాగులను లోకేశ్ చెప్తుంటే నవ్వొస్తోందని.. మాస్ డైలాగులు ఆయన శరీరానికి, గొంతుకు సరిపోదని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ విమర్శించారు. నగరంలోని 16వ డివిజన్లో గల జగదీష్‌నగర్ 1, 2వ వీధులు, మారుతినగర్, తదితర ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం ఆయన నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. టీడీపీ యువగళంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో దడ పుడుతోందని లోకేశ్ వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయన వేసే ప్రతి అడుగుకు వంద ఓట్లు వెనక్కి వెళ్తున్నాయనే విషయాన్ని గమనించాలని హితవు పలికారు. ఆయన ఎంత బాగా పాదయాత్ర చేస్తే అంత బాగుంటుందని.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అంత బలపడుతుందని తమ నేతలు, కార్యకర్తలు ధైర్యంగా ఉన్నారని చెప్పారు. పాదయాత్ర మొదలుపెట్టే సభలో ఇచ్చిన ప్రసంగంతో టీడీపీ నేతలు, కార్యకర్తల్లో నిరుత్సాహం నెలకొని ఉంటుందని తెలిపారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పురాతన నాణేల ప్రదర్శన ప్రారంభం



నెల్లూరు రూరల్: ముత్తుకూరు రోడ్డు పార్థసారథి నగర్‌లోని సిల్వర్ ఓక్స్ స్కూల్లో పురాతన నాణేలు, కరెన్సీ, స్టాంపుల ప్రదర్శనను మేయర్ స్రవంతి శనివారం ప్రారంభించారు. పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శనను తిలకించారు. విజయవాడకు చెందిన న్యూమిస్మాటిక్ అండ్ ఫిలాటిక్ అసోసియేషన్ సభ్యుడు శ్రీధర్‌ను పలువురు అభినందించారు. పాఠశాల డైరెక్టర్లు షణ్ముఖాచారి, వెంకటాద్రి, విద్యాశాఖ ఆర్జేడీ సుబ్బారావు, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పార్కు నిర్మాణానికి శంకుస్థాపన



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 14వ డివిజన్లో గల వేపదొరువు వాటర్ ట్యాంక్ వద్ద రూ.60 లక్షలతో నిర్మించనున్న పార్కుకు సంబంధించిన శంకుస్థాపనను నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో రూ.19 కోట్లతో 23 పార్కులను నిర్మించాలని తలపెట్టామని, ఇందులో 15 పార్కులను ప్రారంభించామని వెల్లడించారు. 13వ డివిజన్లో రూ.1.5 కోట్లతో మూడు పార్కులను అందుబాటులోకి తీసుకురానున్నామని పేర్కొన్నారు. పార్కుల్లో క్రీడలు ఆడుకునేలా ప్రణాళికలను రూపొందిస్తున్నామని తెలిపారు. 13, 14, 15, 16వ డివిజన్లలో దాదాపు రూ.ఐదు కోట్లతో పార్కులను అభివృద్ధి చేశామన్నారు. అనంతరం వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ప్రజల భాగస్వామ్యంతో ఆలయాన్ని త్వరలో నిర్మిస్తామని చెప్పారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గేదెల అపహరణపై కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): గేదెలను అపహరించిన ఘటనపై సంతపేట పోలీసులు కేసును శనివారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని ఖుద్దూస్‌నగర్‌కు చెందిన రత్నమ్మకు రెండు గేదెలున్నాయి. వీటిని పొర్లుకట్ట సమీపంలోని పెన్నానది వద్దకు మేత కోసం రోజూ తీలుకెళ్లేవారు. దాదాపు 45 రోజుల క్రితం పెన్నానది వద్ద అవి అదృశ్యమయ్యాయి.

గాలింపు చర్యలు చేపట్టగా, పోతిరెడ్డిపాళెంలోని ఓ వ్యక్తికి చెందిన షెడ్డులో ఉన్నాయని తెలిసింది. దీంతో ఆమె అక్కడికి వెళ్లి విచారించారు. రెండు గేదెలు షెడ్డు వద్దకు వచ్చాయని.. రెండు రోజుల అనంతరం అవి కనిపించ లేదని ఆయన తెలిపారు. దీంతో ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారంటూ బాధితురాలు ఫిర్యాదు చేశారు.